క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం

ఓర్వకల్లు: స్థానిక జీవేశ్వరస్వామి దేవస్థానం కల్యాణ మండపంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరు కానున్న సమావేశానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు


మాట్లాడుతున్న కేవీ సుబ్బారెడ్డి

కల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన ఓరియేంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మండలానికి 239.4 మెట్రిక్ టన్నుల యూరియా


కొణిదేడులో యూరియా కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

పాణ్యం: మండలానికి 239.4 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని మండల వ్యవసాయ అధికారి జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఒక్కో రైతు కేంద్రానికి 532 యూరియా బస్తాలు సరఫరా చేశామన్నారు. యూరియా కావాల్సి రైతులు పాస్‌బుక్/1బి అడంగల్ కాపీని అందించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎకరాకు ఒక్కో బస్తా చొప్పున 10 ఎకరాల వరకు యూరియా అందిస్తున్నామన్నారు.

నాటక ప్రదర్శనకు ఆదరణ


అంబేడ్కర్ పాత్రధారుడిని సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు (అర్బన్): ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 16న స్థానిక లలిత కళాసమితిలో నిర్వహించిన 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకానికి విశేష స్పందన లభించిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు చెప్పారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. ఈ నాటకంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ బుద్ధున్ని, బౌద్ధ ధర్మాన్ని ఎందుకు ఉన్నతంగా భావించాడు, లక్షల మంది ప్రజలను బౌద్ధ ధర్మం వైపు నడిపేందుకు గల కారణం ఈ నాటకం ద్వారా తేటతెల్లమైందన్నారు. ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు ఈ నాటకాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి ప్రదర్శన కర్నూలులోనే జరిగిందని చెప్పారు. ఈ నాటకం కర్నూలులో విజయవంతమయ్యేందుకు అనేకమంది సహకారం అందించారని, వారికి ధన్యవాదాలు తెలిపారు.

నోరు తెరచిన మ్యాన్‌హోల్స్


కల్లూరులో తెరచిఉన్న మ్యాన్‌హోల్స్

కల్లూరు: కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి క్రిష్ణానగర్‌కు వెళ్లే దారిలో హంద్రీ బ్రిడ్జికి సమీపంలో ప్రధాన రోడ్డుపై రెండు మ్యాన్‌హోల్స్ మూతల్లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్డులో నిత్యం వందల వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రి వేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మ్యాన్‌హోల్స్ తెరచి ఉండటం వల్ల ద్విచక్ర వాహనదాలు, ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్స్‌పై గ్రిల్ లేదా మూతలు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

బాబోయ్..కుక్కలు!


గడివేములలో స్వైర విహారం చేస్తున్న వీధికుక్కలు

గడివేముల: కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త పింఛన్ ఇచ్చేదెప్పుడో?

- అధికారం చేపట్టి ఏడాది దాటినా ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయని ప్రభుత్వం
- కనీసం దరఖాస్తులను కూడా స్వీకరించని వైనం
- సచివాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు
- వెబ్‌సైట్ తెరచుకుంటే చెబుతామంటున్నా అధికారులు
- కోడుమూరు నియోజకవర్గంలో 2 వేల మందికి పైగా అర్హుల ఎదురుచూపులు

నాడు తాము అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు 50 ఏళ్లకే సామాజిక పింఛన్లు ఇస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో ఇదే అంశాన్ని ఊదరగొట్టారు. అయనకు తోడుగా కూటమి పార్టీల నాయకులు ఇంటింటికీ వెళ్లి 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ ప్రజలను నమ్మించారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ హామీని పొందుపరిచారు.

నేడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటింది. ఇప్పటివరకు ఒక్కటి కూడా కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. ఎప్పుడిస్తారో కూడా చెప్పడం లేదు. కనీసం దరఖాస్తు ప్రక్రియ కూడా చేపట్టలేదు. దీంతో చంద్రబాబు మాటలు నమ్మి మరోసారి మోసపోయామని పింఛనుకు అర్హులైన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక పింఛను ఎప్పుడిస్తారు సారూ.. అంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 'ప్రభుత్వం వెబ్‌సైట్ ప్రారంభిస్తే చెబుతాంలే.. ఎన్నిసార్లు వస్తారు' అంటూ అధికారులు కసురుకుంటుండంతో ఈసడింపులకు గురౌతున్నారు.

కర్నూలు(రూరల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. ఇచ్చిన హామీలేవీ నెరవేర్చకుండా అన్ని వర్గాల వారిని మోసం చేసింది. ఒక్కటంటే ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. పైగా ఉన్న వాటిలోనూ కోత విధించే పనిలో ఉంది. దీంతో అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం దరఖా స్తు చేసుకొనేందుకు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు మాత్రం వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదని, తెరుచుకోగానే చెబుతామ ని తిప్పిపంపుతున్నారు. దీంతో ఎప్పుడు వెబ్‌సైట్ తెరచుకుంటుందా.. దరఖాస్తు చేసుకుందామా అని అర్హులైన వారు నెలల తరబడి ఎదురుచూస్తున్నారు.

కూటమి పాలనలో ఇబ్బందులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకోలేదు. దీంతో కుటుంబంలో ఆధారం కోల్పోయిన అనేక మంది వితంతువులు పింఛన్లు మంజూరుగాక ఏడాది నుంచి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వృద్ధులు కూడా అల్లాడుతున్నారు. పింఛన్ వస్తే కనీసం మందుల ఖర్చులకైనా ఇతరులపై ఆధారపడాల్సిన అవస్థ తప్పుతుందని వాపోతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఆ హామీ గురించి అసలు ఆలోచన చేయడం లేదు.



టీడీపీ మేనిఫెస్టోలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ స్పష్టంగా పేర్కొన్న దృశ్యం

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

కోడుమూరు నియోజకవర్గం గుడూరు, సి.బెళగల్, కోడుమూ రు, కర్నూలు రూరల్ మండలాల్లో దాదాపుగా 2 వేల మందికిపైగా అర్హులైన వారు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. వీరంతా పింఛను కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలు, ఎంపీడీఓ కార్యలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూన్నారు. కొందరు టీడీపీ నాయకులను సైతం ప్రసన్నం చేసుకొనే పనిలో ఉన్నారు. అయితే దరఖాస్తు చేసుకొనేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు సమాధానం ఇస్తున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏడాదంతా పింఛన్ దరఖాస్తు వెబ్‌సైట్ అందుబాటులో ఉండేది. ప్రతినెలా మొదట్లోనే కొత్త పింఛన్లు అందజేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏ డాది దాటినా పింఛన్లు మంజూరు చేసేవారు లేరు. ప్ర భుత్వం కొత్త పింఛన్ల ఊసే ఎత్తడం లేదు. ప్రభు త్వం నుంచి ఆదేశాలు రాకుండా దరఖాస్తులను స్వీకరించలే మని అధికారులు లబ్ధిదారులకు చెప్పి పంపిస్తున్నారు.

వితంతు పింఛన్లకు మంగళం

గత వైఎస్సార్‌సీపీ పాలనలో కుటుంబంలో ఆధారం కోల్పోయిన వితంతువులకు మరుసటి నెలలోనే కొత్తగా పింఛన్ మంజూరయ్యేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నూతన పింఛన్లు మంజూరు చేయకపోగా స్పౌజ్ పింఛన్లకు మంగళం పాడింది. స్పౌజ్ పింఛను కింద పలువురు దరఖాస్తు చేసుకున్నా మంజూరుకు నోచుకోలేదు. దీంతో కొత్త పింఛన్లు ఎప్పుడు వస్తాయో అని లబ్ధిదారులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి స్పౌజ్ పింఛన్లను మంజూరు చేయడంతో పాటు నూతన పింఛన్లను ఇచ్చే విధాంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఠంచనుగా పింఛను

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలోనే పింఛన్ మంజూరు చేసేవారు. వితంతు పింఛన్ మరింత వేగంగా మంజూరయ్యేది. భర్త చనిపోతే డెత్ సర్టిఫికెట్‌ను సచివాలయంలో అందజేస్తే పింఛన్ మంజూరు చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలు, పార్టీలకు అతీతంగా పింఛన్లు మంజూరయ్యాయి. అలాగే వలంటీర్ల ద్వారా ప్రతినెలా 1వ తేదీన తెల్లవారకముందే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేవారు.

చంద్రబాబును నమ్మి మోసపోయాం



పింఛను కోసం ఎన్నో నెలలు నుంచి ఎదురుచూస్తున్నా. 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని సీఎం చంద్రబాబు చెప్పడంతో నమ్మాం. అయితే కూటమి ప్రభుత్వం ఎర్పడినప్పటి నుంచి కొత్త పింఛన్‌లకు కనీసం దరఖాస్తులను కూడా స్వీకరించలేదు. పలుమార్లు సచివాలయ సిబ్బందిని అడిగినా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు అని సమాధానం ఇస్తున్నారు. ఇప్పటికే ఆలస్యం అయ్యింది. కూటమి నాయకుల హామీని నమ్మి మోసపోయాం.

– షేక్ బాషా, ఇ.తాండ్రపాడు గ్రామం

వితంతు పింఛన్ కూడా ఇవ్వలేదు



నా భర్త 10 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆసరా కోల్పోయిన నాకు కనీసం వితంతు పింఛను కూడా మంజూరు చేయలేదు. అనారోగ్య సమస్యలు, గృహ నిత్యావసరాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. ప్రభుత్వం పింఛను మంజూరు చేసి నాలాంటి వారిని ఆదుకోవాలి.

– గొల్ల చంద్రమ్మ, ఉల్చాల గ్రామం

వెబ్‌సైట్ ఓపెన్‌లో లేదు



పింఛన్‌లకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి. పాత పింఛన్ల పరిశీలన పూర్తైన తరువాత కొత్తవాటికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తరువాత అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తాం.

– జి.రఘునాథ్, ఎంపీడీఓ, కర్నూలు మండలం

చదువుకోవాలంటే ప్రమాదాన్ని దాటాల్సిందే!


జాతీయ రహదారిని దాటుతున్న విద్యార్థులు

ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన విద్యార్థులు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్లాలంటే జాతీయ రహదారిని దాటడం దినదిన గండంగా మారింది. సుమారు 800 మంది విద్యార్థులు 6 నుంచి 10వ తరగతి వరకు స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుకునేందుకు రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామం చివరలో పాఠశాల ఉండడంతో స్థానిక బంగ్లా బస్టాండ్ వద్ద ఉన్న జాతీయ రహదారిని దాటడం విద్యార్థులకు తలకుమించిన భారమవుతోంది. అసలే చిన్నపిల్లలు స్థాయికి మించిన బరువు(పుస్తకాల బ్యాగు)ను భుజాన వేసుకుని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రోడ్డును దాటుతున్నారు. ఏ వాహనం ఎటు నుంచి వచ్చి ఢీకొంటుందోనని బిక్కుబిక్కుమంటూ రోడ్డును దాటుతున్నారు. హైవే అధికారులు ప్రస్తుతం అచలాపీఠం వద్ద నిర్మించిన వంతెనను.. బంగ్లా బస్టాండ్ వద్ద నిర్మించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంటితుడుపు చర్యగా నిర్మించిన కాలినడక వంతెనతో విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

– ఓర్వకల్లు

ఫర్టిలైజర్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

- 12 రోజుల వ్యవధిలో రెండుసార్లు తనిఖీలు
- రికార్డులు సరిగాలేని రూ.9.16 లక్షల ఎరువులు సీజ్


సి.బెళగల్‌లో కిసాన్‌మాల్ ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని ఎరువులు, పురు గు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడులలో రికార్డులు సక్రమంగాలేని దాదాపు రూ.9.16 లక్షలు విలువ చేసే ఎరువులను సీజ్ చేశారు. గురువారం ఒంగోలు ఏడీఏ రమేష్‌బా బు, వైఎస్సార్ జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకట నారాయణ, మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ సి.బెళగల్‌లోని శివసాయి ఫర్టిలైజర్స్, కిసాన్ మాల్, ఓం నాగసాయి ఏజెన్సీస్‌లలో స్థానిక వ్యవసాయ సిబ్బందితో కలిసి ఎరువు లు, పురుగు మందుల నిల్వలపై తనిఖీలు నిర్వహించారు. శివసాయి దుకాణంలో రికార్డులు సరిగాలేని రూ.2,09,100 విలువ చేసే ఎరువుల నిల్వలను, కిసాన్‌మాల్‌లో ఈ–పాస్ యంత్రం, నిల్వల రికార్డులలో తేడాలు ఉండటంతో రూ.5,22,093 విలువ చేసే ఎరువులను, ఓం శ్రీ నాగసాయి ఏజెన్సీలో నిల్వ తేడాలతో రూ.1,85765 విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏడీఏ రమేష్‌బాబు, మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన, అనుమతులున్న ఎరువులు, పురుగు మందులనే అమ్మాలని, ప్రతి అమ్మకంపై రైతులకు తప్పనిసరిగా రసీద్‌లను అందజేయాలని, అధిక ధరకు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏఓ మల్లేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు తమ రికార్డులను, నిల్వలను పకడ్బందీగా నిర్వహించుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది వెంట ఉన్నారు.

కోడుమూరులో..

కోడుమూరు రూరల్: కోడుమూరులోని ఎరువుల దుకాణాల్లో గురువారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు ఏడీఏ రమేష్‌బాబు, కడప విజిలెన్స్ సీఐ నారాయణ పాల్గొని దుకాణాల్లో ఎరువుల స్టాక్, సేల్స్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ ఫర్టిలైజర్స్‌లో ఎరువుల అమ్మకాల వివరాలను దుకాణదారుడు ఈ–పాస్ మిషన్‌లో ఎంట్రీ చేయనందున రూ.21,53,000 విలువ చేసే 73 టన్నుల ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. కోడుమూరు ఏఓ రవిప్రకాష్ ఉన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు

- 4 రోజుల్లో ట్రేడ్ లైసెన్సు బకాయిలు వసూలు చేయాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశం


పారిశుద్ధ్యంపై సూచనలు చేస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. గురువారం నగరంలో మున్సిపల్ అధికారులతో కలిసి క్రిష్ణానగర్, కల్లూరు, బిర్లా కాంపౌండ్, వెంకటరమణ కాలనీలలో కమిషనర్ పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో మున్సిపల్ పారిశుద్ధ్యం, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లదే కీలక బాధ్యత అన్నారు. వారం రోజుల వ్యవధిలో పారిశుద్ధ్యాన్ని గాడిలో పెట్టాలన్నారు. వారానికోసారి మురుగు కాల్వలు శుభ్రం చేయాలని, పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్మికులు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. వాణిజ్య దుకాణాల వద్ద చెత్త కుండీలు ఉండేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో ఆహారం రుచిగా ఉండాలి

నగర పరిధిలో ఉన్న 5 అన్న క్యాంటీన్లలో మూడు పూటలా ఆహారం రుచికరంగా ఉండాలని, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని కమిషనర్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అక్కడున్న వారితో భోజన నాణ్యతపై కమిషనర్ ఆరా తీశారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తక్షణమే తొలగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. గురువారం కార్మిక కర్షక భవన్‌లో ప్రజా వేదిక ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ ఆధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ఇంధన సర్దుబాటు పేరుతో ట్రూ అప్ చార్జీలను వసూలు చేయడం ఆపాలన్నారు. యూనిట్ విద్యుత్ వినియోగానికి ఆరు పైసల నుంచి రూపాయి వరకు వేసిన సుంకాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 2024–25 మధ్య వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేసిన రూ.2787 కోట్లు, 2019–25 మధ్య కాలానికి వసూలు చేసిన రూ.1500 కోట్లను ట్రూడౌన్ ద్వారా బిల్లులో తగ్గించాలన్నారు. ప్రజలపై కూటమి ప్రభుత్వం వేసిన అదనపు విద్యుత్ భారం రూ.15526 కోట్లను రద్దు చేయాలన్నారు. అదానీ కంపెనీతో జరిగిన సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానం మేరకు పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరారు. మరోవైపు ప్రమాదకర విద్యుత్ సంస్కరణ చట్ట సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 2 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులకు ప్రజా వేదిక పిలుపునిస్తోందని చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కోడుమూరు రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ విమర్శించారు. గురువారం గూడూరులో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల కరపత్రాలను ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయి ఉదయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించేదిగా ఉందని ఆరోపించారు. గూడూరులోని పాఠశాలల్లో, హాస్టళ్లలో మౌలిక వసతులు, సదుపాయాలు లేక విద్యార్థినీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, గూడూరు మండల విద్యార్థుల ఇబ్బందులను తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఖాజావలి, స్థానిక నాయకులు వేణు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలకల్‌లో సామాజిక తనిఖీ గ్రామసభ


గ్రామసభలో తనిఖీ నివేదికను చదువుతున్న డీఆర్పీ శివ

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో ఉపాధి హామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ అంశాలపై డీఆర్పీలు శివ, నాగరాజు గ్రామసభ నిర్వహించారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామ సభలో.. గ్రామ పంచాయతీ పరిధిలో 166 పనులు చేపట్టగా, రూ.3.77 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు వారు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన తనిఖీలలో పనుల కొలతలలో తేడాలు, కూలీలకు బదులుగా కుటుంబ సభ్యులు పని చేసినట్లు, జాబ్ కార్డులలో కొత్తవారిని యాడ్ చేడటం వంటి పొరపాట్లను గుర్తించినట్లు డీఆర్పీలు తెలిపారు. సభకు హాజరైన స్టేట్ రీసోర్స్ పర్సన్ వెంకటేష్‌నాయక్ గ్రామస్తులను, ఉపాధిహామీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని, కుటుంబానికి ఒక్క జాబ్ కార్డు మాత్రమే కలిగి ఉండాలని, కొత్త జాబ్‌కార్డులు కొత్త కుటుంబాలకు మాత్రమే జారీ అవుతాయని ఆయన వెల్లడించారు. సభలో పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, ఏపీఓలు రామన్న, లక్ష్మన్న, ఈసీ పృథ్వీ రాజ్, రంగస్వామిగౌడ్, టీఏ అలీఫ్‌ప్రియ, ఎఫ్ఏలు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

- కమిటీకి ఇవే చివరి ఎన్నికలు
- ఈ నెల 24 వరకు నామినేషన్ల స్వీకరణ
- 25న నామినేషన్ల పరిశీలన
- 28వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు
- ఆగస్టు 1న ఎన్నికలు


నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పుడున్న స్టాండింగ్ కమిటీకి ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. దీంతో నగర పాలక సంస్థ పాలక వర్గానికి సంబంధించి చివరి స్టాండింగ్ కమిటీకి ఎన్నికల షెడ్యూల్‌ను గురువారం సాయంత్రం అధికారులు విడుదల చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసే కార్పొరేటర్లు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నామినేషన్లను సమర్పించవచ్చు. ఈ నెల 24వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 25న నామినేషన్ల పరిశీలన, అదే రోజు అభ్యర్థుల జాబితా ప్రచురిస్తారు. ఈ నెల 28వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆగస్టు 1న స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది. విజయం సాధించిన అభ్యర్థులను అధికారులు ప్రకటిస్తారు. ఈ కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారు నగరపాలకకు సంబంధించి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు ఆమోదం వ్యక్తం చేయాల్సి ఉంటుంది.

నాలుగు సంవత్సరాలు విజయవంతంగా...

నగరపాలక సంస్థ పాలకవర్గానికి సంబంధించి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన అభ్యర్థులే గెలుస్తూ వచ్చారు. గతేడాది కొంత పరిణామాలు మారాయి. కొంతమంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. గతేడాది జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో మంత్రి ఆదేశాల మేరకు స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో నిలిచారు. మంత్రి ఆయన స్థాయిలో చక్రం తిప్పారు. పావులు కదిపారు. డబ్బు ఎర వేశారు. టీడీపీకి చెందిన 9 మందికి అదనంగా మరో 11 మంది వైసీపీ కార్పొరేటర్లు చేరడంతో గత స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి ఇద్దరు పోటీ పడ్డారు. క్రాస్ ఓటింగ్‌తో వైఎస్సార్‌సీపీకి దెబ్బకొట్టాలని అన్ని ప్రయత్నాలు చేసినా తెలుగుదేశం పార్టీకి ఎన్నికల్లో భంగపాటు తప్పలేదు. కార్పొరేషన్‌లో ఒక మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు ఉన్నా టీడీపీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. పోటాపోటీగా ఈ ఎన్నికలు నిర్వహించినా ఐదుగురు అభ్యర్థులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే గెలుపొందారు. తాజాగా మరోసారి నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈ పాలక వర్గానికి ఇవే చివరి స్టాండింగ్ కమిటీ ఎన్నికలు. అయినా పట్టుమని 8 నెలల కూడా గడువు ఉండదు. పైగా గెలుస్తామా? అన్న ఆందోళన ఆ పార్టీకి ఉంది. దీంతో తెలుగుదేశం నుంచి పోటీకి దిగే పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు.

మురుగు ఇలా..నడిచేదెలా?


సచివాలయం ఎదురుగా రోడ్డుపై నిల్వవున్న మురుగునీరు

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ సచివాలయం ఎదురుగా, ప్రధాన రహదారిపై మురుగు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారుల అనాలోచితం, ప్రజాప్రతినిధుల బలహీనతల కారణంగా గ్రామంలోని బస్టాండ్ నుంచి కర్నూలు వైపు వెళ్లే సీసీ రోడ్డును ఏటవాలుగా నిర్మించడంతో రోడ్డుపైనే మురుగు నిల్వ ఉంటోంది. దీంతో నిత్యం సచివాలయానికి రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక మురుగులో దోమలు వృద్ధి చెంది ప్రజల వ్యాధులకు కారణమవుతున్నాయి. సమీపంలోనే ఓ ప్రైవేట్ స్కూల్ ఉంది. విద్యార్థులు కూడా రాకపోకలు సాగించే క్రమంలో కాలుజారీ పడిన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పరిష్కారం దిశగా ఆలోచించాలని గ్రామస్తులు కోరుతున్నారు.